క్లుప్తంగా

నవమి వేడుకల్లో ఎమ్మెల్సీ సిపాయి



రేణిగుంట: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గుత్తివారిపల్లి కోదండరామ స్వామి ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి, ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి, జెడ్పీటీసీ సంధ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, సర్పంచ్ మంజుల స్వామి వారిని దర్శించుకున్నారు. రేణిగుంట భజన గుడి వీధిలోని రాములవారి భజన మందిరంలో గురువారం రాత్రి ఆమె పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. వైస్ ఎంపీపీ సుజాత, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నగేషం, కో–ఆప్షన్ సభ్యుడు సుభాన్‌రాజ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పిచ్చాటూరు: పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వైఎస్సార్ ఆసరా మెగా చెక్కు పంపిణీ చేయనున్నట్లు ఏపీఎంలు వనిత, సీతారామయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నాగలాపురం టీఆర్‌ఆర్ కల్యాణ మండపంలో, మధ్యాహ్నం 2 గంటలకు పిచ్చాటూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని మహిళా సంఘాల సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

గుండెపోటుతో వార్డుమెంబరు మృతి


మురుగయ్య (ఫైల్)

సత్యవేడు: అల్లపుగుంట పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ వార్డు మెంబరు మురుగయ్య(59) గుండెపోటుతో బుధవారం అర్ధ రాత్రి మృతి చెందాడు. మృతుడు బుధవారం రాత్రి భోజనం అనంతరం కొద్దిసేపు బంధువులతో మాట్లాడి నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో మెలకువ వచ్చి గుండెనొప్పిగా ఉందని కేకలు వేశాడు. సర్పంచ్ మునస్వామి సహకారంతో సత్యవేడు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని కుమారుడు గుర్రప్ప సచివాలయ కన్వీనర్ విధులు నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ భర్త మాస్టర్ స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్ రెడ్డి, పార్టీ నాయకులు సంతాపం తెలిపారు.

అర్చి నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయమైన నీలకంఠేశ్వరస్వామి ఆలయ నూతన అర్చి నిర్మాణానికి గురువారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. రూ.16లక్షల వ్యయంతో ఈ నూతన అర్చి నిర్మాణం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్, ఇంజినీరింగ్‌శాఖ అధికారులు ఈఈ మురళీధర్, ఏఈ శోభారాణి, వేదపండితులు అర్ధగిరి శర్మ, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సమాజ సేవతో వ్యక్తిత్వ వికాసం

కార్వేటినగరం: సమాజసేవ ద్వారా వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని ప్రముఖ హోమియోపతి వైద్యులు డాక్టర్ కమలాకర్‌రెడ్డి అన్నారు. గురువారం సుద్దగుంట గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు స్పెషల్ క్యాంపుల ద్వారా సమయ పాలన, కార్యనిర్వహణ పద్ధతులు, సేవ ద్వారా నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, జీవిత నైపుణ్యాలను నేర్చుకోవాలని వివరించారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు గ్రామంలో చేపట్టిన సేవలకు అభినందనలు తెలిపారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తులు

రొంపిచెర్ల: రొంపిచెర్ల కస్తూర్బా గురుకుల పాఠశాలలో 2023–24 సంవత్సరం ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ప్రత్యేక అధికారి సుజాత తెలిపారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ సీఈసీ గ్రూపులో 40 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. 7, 8, 9 తరగతుల్లో 4 సీట్లు మాత్రమే ఉన్నట్లు తెలిపారు. ఏప్రిల్ 20వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బాలికలు మాత్రమే అర్హులని తెలిపారు.

శ్రీకాళహస్తిలో కల్యాణోత్సవానికి హాజరైన ప్రముఖులు, భక్తులు, సీతారాముల కల్యాణం తాళిబొట్టును చూపుతున్న వేదపండితులు





నాగలాపురం శ్రీ సీతారాముల కల్యాణానికి తలంబ్రాలు తెస్తున్న భక్తులు



శ్రీ సీతారాముల కల్యాణ వైభోగమే..

శ్రీకాళహస్తి: పట్టణంలోని నెహ్రూవీధిలో ఉన్న శ్రీపట్టాభి రామమందిరంలో సీతారాముల కల్యాణం గురువారం నయనానందకరంగా సాగింది. ఉదయం 11.50 నుంచి 12గంటలలోపు అభిజిత్ శుభముహూర్తాన సీతారాముల కల్యాణోత్సవం అత్యంత వేడుకగా జరిగింది. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఎమ్మెల్యే కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి ముత్యాల తలంబ్రాలు అందజేశారు. వేదపండితులు శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. వరదరాజస్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ జరుగుతున్న సందర్భంగా రామాలయం ఎదురుగా రోడ్డుపై బహిరంగ వేదిక ఏర్పాటు చేశారు. మొదట స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. కల్యాణఘట్టం చూడటానికి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు. అనంతరం విశేష నైవేద్యం, మంత్రపుష్పం, దీపారాధన, హారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఈవో సాగర్‌బాబు, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు.


నాగలాపురం శ్రీ వేదనారాయణ స్వామి సన్నిధిలో సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తజనం

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

ఏర్పేడు: మండలంలో ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయాల వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు వివిధ రకాల అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పాపానాయుడుపేట స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా సాగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. మర్రిమంద రామాలయంలో ఉభయకర్త రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు శివరామిరెడ్డి ఆధ్వర్యంలో విశేష పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

రాజానగరంలో..

పిచ్చాటూరు: మండలంలోని రజానగరం సీతాలక్ష్మణ సమేత శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో గురువారం శ్రీరామనవమి ఉత్సవాలు వేడుకగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేక, పూజలు చేసి వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. తొలిరోజు ఉభయదారులుగా నవజీవన్ ట్రస్ట్ నిర్వాహకులు వ్యవహరించారు. ఈ ట్రస్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. కీళపూడిలోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయంలో కొలువుదీరిన షిర్డీ సాయిబాబాకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామంలో శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా సీతారాముల వారితో పాటు లక్ష్మణుడి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి అభిషేక పూజలు చేపట్టారు. మండల కేంద్రంలోని శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామిని, గాజులపెళ్లూరులోని సీతారాముల ఆలయంలో, నీర్పాకోట గ్రామంలోని చెంగాళమ్మ పరమేశ్వరి దేవత, కనమనంబేడు గ్రామంలోని వేమలమ్మ, కాటూరులోని రామాలయంలోని సీతారాముల చిత్రపటాలను పూలతో అలంకరించి, పూజలు చేశారు. భారీసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలోని శ్రీవేంకటేశ్వరస్వామి, పద్మావతి, అలమేలుమంగమ్మ ఉత్సవమూర్తి విగ్రహాలకు గ్రామస్తులు ఘనంగా పూజలు చేశారు. పూలతో అలంకరించి, గుడి చుట్టూ ఊరేగించారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భక్తులు భారీసంఖ్యలో పాల్గొన్నారు.


పిచ్చాటూరు: రజానగరంలో ప్రత్యేక అలంకరణలో సీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి


బుచ్చినాయుడుకండ్రిగ: సీతారాములకు పూజలు చేస్తున్న భక్తులు











రజానగరం శ్రీ కోదండరామాలయంలో, శ్రీకాళహస్తిలో భక్తులకు అన్నదానాలు, ముత్యాల తలంబ్రాలు అందజేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి, మర్రిమంద రామాలయంలో హోమం, బుచ్చినాయుడుకండ్రిగ: అలంకరణలో సీతారాముల విగ్రహాలు

మామిడికి మంచు దెబ్బ

- మామిడి చెట్లలో కానరాని పూత
- దిగాలు చెందుతున్న అన్నదాత


కనమనంబేడు గ్రామంలో పూతరాని మామిడి చెట్లు

బుచ్చినాయుడుకండ్రిగ: గత కొద్ది రోజులుగా కురుస్తున్న పొగమంచుతో మామిడి చెట్లల్లో పూత రాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కనమనంబేడు, గాజులపెళ్లూరు, కుక్కంబాకం, కంచనపుత్తూరు. ఆలత్తూరు, పీలీకండ్రిగ, బుచ్చినాయుడుకండ్రిగ, కల్లివెట్టు, నెలవాయి, వెస్తువరత్తూరు గ్రామాల్లో 400 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం డిసంబరు, జనవరి నెలల్లో మామిడి పూత వస్తుంది. పూత వచ్చిన సమయంలో వాతావరణం అనుకూలిస్తే మంచి దిగుబడులు వస్తాయి. అయితే అకాల వర్షాలు పడడంతో పాటు అధికంగా పొగమంచు కురువడంతో మామిడి పూత రాకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం పిందె దశలో ఉండవలసిన మామిడి తోటలు ఖాళీగా దర్శమిస్తుండడంతో పాటు రైతులు ఆందోళనలో ఉన్నారు. తోటలను కౌలుకు తీసుకున్న రైతులు అధికంగా కురుస్తున్న మంచుకు పంటలపై ఆశలను వదులుకుంటున్నారు. గతేడాది కూడా ఇదే పరిస్థితి ఏర్పడిందని, ఈ ఏడాది అదే కొనసాగుతుందని రైతులు, కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి మామిడి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

అందువల్లే పూత రావడం లేదు

అకాల వర్షం, పొగమంచు అధికంగా ఉండడం వల్ల తేనె మంచు పురుగు ఆశించడం వల్ల పిందెలు, కాడల రసాన్ని పీల్చడం వల్ల మామిడి తోటలకు నష్టం వాటిల్లుతుంది. దీని నివారణకు కాన్ఫిడార్ మందు 0.5 ఎంఎల్, సాఫ్ 2 గ్రాములు, ప్లానోఫిక్స్ 0.25 ఎంఎల్ లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలి.

– శారద, ఉద్యానవనశాఖ అధికారి

శాస్త్రోక్తంగా బాలాలయ పూజలు




వీరభద్రస్వామి ఆలయంలో, చక్రేశ్వరస్వామి ఆలయంలో బాలాలయ పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయాలైన వీరభద్రస్వామి ఆలయం, వేడాంలోని కాలభైరవస్వామి, ఆలయం పట్టణంలోని చల్లేశ్వరస్వామి ఆలయం, చక్రేశ్వరస్వామి ఆలయాల్లో గురువారం శాస్త్రోక్తంగా బాలాలయ పూజలు చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ స్థానాచార్యులు స్వామినాథన్ గురుకుల్ ఆధ్వర్యంలో సంకల్ప పూజలు, కలశ పూజలు హోమ పూజలు నిర్వహించారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు, ఆలయ ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్, ఉప ప్రధానార్చకులు కరుణాకర్‌గురుకుల్ అభిషేక గురుకుల్, నిరంజన్‌గురుకుల్, పాలకమండలి సభ్యులు పసల సుమతి, ఆలయ వేదపండితులు, అర్చకులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో శుక్రవారం వాహనాలను వేలం వేయనున్నట్లు ఇన్‌స్పెక్టర్ పి.టి.శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకాళహస్తి పరిధిలో ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలను ఈ వేలంలో వేయనున్నట్లు తెలిపారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్ కలిగిన వారు నిర్దేశించిన ధరావతు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు శ్రీకాళహస్తి ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు ప్రశంసనీయం


ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఈవో సాగర్‌బాబు

శ్రీకాళహస్తి: స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు ప్రశంసనీయమని శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో సాగర్‌బాబు అన్నారు. ఆయన స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు గురువారం ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ మంచి సేవలు అందించారని తెలిపారు.

నేడు వైఎస్సార్ ఆసరా సంబరాలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పురపాలకసంఘ కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించనున్నట్లు కమిషనర్ బాలాజీనాయక్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకాళహస్తి పట్టణం, తొట్టంబేడు మండలాల పరిధిలోని ఆసరా లబ్ధిదారులతో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమావేశం కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు డ్వాక్రా మహిళలు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): తొట్టంబేడు మండలంలోని తొట్టంబేడు, బీడీకాలనీ, శ్రీరామనగర్‌కాలనీ, చెరుకు రాగప్పనాయుడు కండ్రిగ గ్రామాల్లో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి తెలిపారు. ఆమె గురువారం మీడియాతో మాట్లాడుతూ, ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించనున్నట్లు వివరించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నియోజకవర్గంలో ప్రారంభించి వంద రోజులుపూర్తి అయిందని చెప్పారు. ప్రజలు విన్నవించిన సమస్యలను నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ పేరిట ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు గుర్తుచేశారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు చెంచుకృష్ణనాయుడు

కేవీబీపురం: మండలంలోని పెరిందేశం గ్రామంలో ఏటా నిర్వహించే జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు గురువారం ఎంపీపీ మునిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుడు చెంచుకృష్ణనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు నింద్ర, కళత్తూరు, శ్రీకాళహస్తి, వరదయ్యపాళెం జట్లు తలపడ్డాయి. అందులో వరదయ్యపాళెం, కళత్తూరు జట్లు ప్రతిభ చాటి మొదటిరౌండ్‌లో విజేతలుగా నిలిచాయి. విజేతజట్లకు వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుడు చెంచుకృష్ణనాయుడు రూ.10000 నగదు బహుమతి, మరో రూ.10 వేలు విలువ చేసే ఆరు వాలీబాల్స్, నాలుగు నెట్లను విరాళంగా అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు నందకుమార్, హరిబాబు, గిరి, ఎంపీటీసీ అను, సర్పంచ్ బత్తెయ్య, సుబ్బరామనాయుడు, మాధవయ్య, నాగేష్, ఏలుమలై, వెంకటేష్, సంపత్, ఆర్గనైజర్ బత్తెయ్య, అనిల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్డు


గుంతలమయమైన జంబుగోళం రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని జంబుగోళం, జీఎన్‌కండ్రిగ, ఆర్.అనంతాపురం, పూసలపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్డు తారురోడ్డు గుంతలమయమై అధ్వాన్నంగా ఉంది. దీంతో గ్రామస్తులు, వాహనాదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కేటీ రోడ్డు నుంచి జంబుగోళం గ్రామానికి నాలుగు కిలోమీటర్లు ఆర్అండ్‌బీకి సంబంధించిన తారురోడ్డు ఉంది. రోడ్డు వెంబడి జీఎన్‌కండ్రిగ, ఆర్ అనంతాపురం, పూసలపల్లి గ్రామాలున్నాయి. ఇటీవల కురిసి భారీవర్షాలకు రోడ్డు దెబ్బతిని, అధ్వాన్నంగా మారింది. వర్షం పడితే గుంతల్లోకి నీరు చేరి రొచ్చుగా తయారు అవుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. రోడ్డుపై నడవడానికి కూడా ఇబ్బందిగా ఉంటోందని వారు వాపోతున్నారు. ద్విచక్రవాహనాలు, కార్లు వెళ్లడానికి మరింత ఇబ్బంది ఉంటోందని వాహనదారులు చెబుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు









పాండూరులో ధ్వజరోహణం, శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు, పుష్పాలంకరణలో.., సత్యవేడు: కల్యాణోత్సవంలో సీతారాములు

వరదయ్యపాళెం: మండలంలోని పెద్ద పాండూరులో ఉన్న శ్రీ సీతాసమేత శ్రీ కోదండరామస్వామి ఆలయం, వరదయ్యపాళెంలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయం, హీరో పరిశ్రమ సమీపంలోని శ్రీ సీతారామ కోదండరామాలయంలో గురువారం శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం పాండూరు కోదండరామస్వామి ఆలయంలోని ధ్వజస్తంభానికి ధ్వజారోహణ పూజలతో మూడు రోజులపాటు జరగనున్న ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో నవమి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సీతారామస్వామికి అభిషేకం చేసి, భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. ఆలయంలో రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర విశ్రాంత ఆర్అండ్‌బీ ఇంజినీర్ పరంధామ రెడ్డి ఆలయంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్త జనసందోహం మధ్య..

హీరో పరిశ్రమ సమీపంలోని మాదనపాళెంకు చెందిన సీతారామ కోదండరామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా గురువారం సాయంత్రం స్వామి, అమ్మవార్ల కల్యాణం అశేష భక్తజన వాహిని నడుమ ఘనంగా జరిగింది. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

వేకువజామునుంచే..

సత్యవేడు: మండలంలో శ్రీరామనవమి పర్వదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కోదండరామస్వామి ఆలయం, వీరభద్ర స్వామి ఆలయంలో వేకువజామున నుంచే ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. ఆంజనేయస్వామి వారిని తమలపాకులతో అలంకరించారు. అనంతరం కనుల పండువగా సీతారాముల వారి కల్యాణోత్సవం నిర్వహించారు. సీతారాములను భక్తులు దర్శించుకున్నారు.

పదో తరగతి విద్యార్థులు సత్తా చాటాలి


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం: పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో సత్తా చాటాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆకాంక్షించారు. మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో గురువారం జరిగిన వీడ్కోలు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సరస్వతి పూజ నిర్వహించి ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థులకు హాల్‌టికెట్లను అందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు కావల్సిన అన్ని వసరులను రాష్ట్రప్రభుత్వం సమకూర్చడంతో పాటు, నాణ్యమైన విద్యను అందించడంలో ప్రత్యేకశ్రద్ధ తీసుకుందన్నారు. ఈసారి పది పరీక్షల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తారని గట్టి నమ్మకం ఉన్నట్లు తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులను కల్పించినట్లు చెప్పారన్నారు. విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయడంలో ఉపాధ్యాయులు ప్రత్యేకశ్రద్ధను కనబరిచారని ప్రశంసించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను ఎమ్మెల్యే ఆశీర్వదించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య, ఎంపీపీ మునిలక్ష్మి, జెడ్పీటీసీ మునెమ్మ, ఎంపీటీసీ అయ్యప్ప, నేతలు నందకుమార్, లాల్‌బాబు, ధనుంజయరెడ్డి, గిరి, ఎంఈఓ లక్ష్మీపతి, ఎంపీడీఓ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.